# పరిపూర్ణ విడుదల

ఆధ్యాత్మిక మాసపత్రిక

అర్పణ : 27 జూలై : 2026 విడుదల : 11

**మనుష్యుడు రొట్టెవలన**

**మాత్రము కాదుగాని**

**దేవుని నోటనుండి వచ్చు**

**ప్రతిమాటవలనను జీవించును**

*– మత్తయి 4:4*

# పరిపూర్ణ విడుదల

ఎడిటర్ : బ్రదర్ దీవెనయ్య

జూలై - 2026

**సంవత్సరపు సభ్యత్వ చందా: రూ.150/- , విడి ప్రతి : 15/-**


## విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | ఎడిటర్ అర్పణ | 3-6 |
| 2. | విజ్ఞాపనలో విశ్వాసపు పాత్ర | 7-9 |
| 3. | శపితమైన దానిమీద దృష్టి | 10-11 |
| 4. | ఒక మాదిరి కుటుంబము | 12 |
| 5. | శోధనను జయించుట | 13-17 |
| 6. | నేటికి మూడు దినములనుండి | 18-19 |


## సంపూర్ణ రాత్రి ఉపవాస ప్రార్థన

**ప్రతి నెల 1 వ తేది**

సమయం: రాత్రి గం॥ 9.00

స్థలము: **హోలీమినిస్ట్రీస్ ప్రార్థనా మందిరము**

**బుడంపాడు, గుంటూరు**

# ఎడిటర్ అర్పణ

***మన రక్షకుడైన యేసుప్రభువు నామములో మీ అందరికి నా హృదయపూర్వక వందనములు తెలియజేయుచున్నాను.***

**"దేవుని మందసము పట్టబడి పోయినందున ప్రభావము ఇశ్రాయేలీయులలోనుండి చెరపట్టబడి పోయెనని ఆమె చెప్పెను"** 1సమూ. 4:22. **"ఫిలిష్తీయులు దేవుని మందసమును పట్టుకొని ఎబెనెజరునుండి అష్డోదునకు తీసికొని వచ్చి దాగోను గుడిలో దాగోను ఎదుట దాని నుంచిరి"** 1సమూ. 5:1,2.

ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధముచేసి వారిలో కొందరిని హతముచేసి దేవుని మందసమును వారి దేశమునకు చెరగొని తెచ్చుకొనిరి. ఏలయనగా దేవుని మందసము ఎక్కడ ఉండునో అక్కడ దేవుని ప్రభావము శక్తి ఉండునని వారెరుగుదురు. గనుక ఇశ్రాయేలీయులను చెరగొని తీసికొని రాలేదు గాని కేవలం దేవుని మందసమును మాత్రమే తెచ్చుకొని దాగోను గుడిలో నుంచిరి. ఏలీ మందదృష్టి గలిగినవాడైనప్పటికి మందసము పట్టబడింది అనే మాట వినబడగానే అతడు ప్రాణము విడచెను. ఇశ్రాయేలీయులలో నుండి ప్రభావము పోయెననియు తన మామయు తన పెనిమిటియు చనిపోయిరనియు ఏలీ కోడలు విని నొప్పులు తగిలి మోకాళ్ళ మీదికి క్రుంగి ప్రసవమాయెను. ఆమె మృతునొందుచుండగా తన కుమారునికి ఈకాబోదు అను పేరు పెట్టెను. శత్రువైన ఫిలిష్తీయుల దృష్టి అంతయు దేవుని మందసము పైనే. దాగోను గుడిలో దాగోను దేవతను ఆరాధించేవారికి మందసముతో ఏమి పని? దేవుని మందసమును, ప్రభావమును ఇశ్రాయేలీయుల నుండి తొలగిస్తే అప్పుడు ఇశ్రాయేలీయులు ఇక జయము

నీ జీవితములో దేవుని సన్నిధికి సమీపముగా తీసికొని వచ్చే ప్రార్థన, దేవునితో సహవాసము మరియు స్వపరీక్ష చేసికొనే మనస్సును అపవాది

దూరము చేస్తాడు. నీవు పరిశీలన చేసికొంటే తీర్పులోనికి రావు, బలపరచబడతావు మరియు అపవాది తంత్రములను ఎదిరించగలవు. అయితే ఎందుకు నేను చేయలేకపోతున్నాను అని పరిశీలించుకొనే మనస్సు నీకు లేకుండా నేను బాగున్నాను అనే మనస్సు అపవాది పెడతాడు. మనము ఆ సాతాను తంత్రములను ఎరిగినవారివలె ఉండవలెను (2 కొరింథి. 2:11).

ఫిలిష్తీయులు మందసమును ఆరాధించడానికి రాలేదు గాని ఇశ్రాయేలీయుల దగ్గర నుండి తీసుకొని వచ్చిన మందసము తన స్థానములోనే భద్రముగా ఉన్నదా, లేదా అని పరీక్షించడానికి వచ్చారు. వారి దృష్టంతా మందసము పైనే. నీవు దేవుని సన్నిధిని పొందుకోవాలి అంటే నీవు ఏమి చేస్తే దేవుని సన్నిధి నీతో ఉంటుందో అపవాదికి తెలుసు అందుకని అది చేయకుండా వాడు నీ జీవితములో పని చేస్తుంటాడు. **"ఆ మరునాడు వారు ఉదయముననే లేవగా ఇదిగో దాగోను యెహోవా మందసం ఎదుట నేలను బోర్లపడి యుండెను. దాగోను యొక్క తలయు రెండు అరచేతులను తెగవేయబడి గడపదగ్గర పడియుండెను"** 1సమూ. 5:4. ప్రాతఃకాలం అనగా ఇంకా సూర్యుడు రాకముందు వేకువనే వారు మందసమును చూడవలెనని ఎంతో ఆత్రుతగా ఉన్నారు. **"మీ విరోధియైన అపవాది గర్జించు సింహమువలె ఎవరిని మ్రింగుదునా అని వెదకుచు తిరుగుచున్నాడు"** 1పేతురు 5:8. అపవాది చాలా చురుగ్గా ఉంటాడు. నీ జీవితములో కూడా నీవు ఎలాగా దేవుని పని చేయకుండ ఉండాలి అనేదే వాడి గురి. దేవునికి, సహవాస క్రమానికి పెద్దలకు లోబడుతున్నానా? పరిశుద్ధ జీవితమును ప్రేమిస్తున్నానా అని నీవు పరిశీలన చేసుకోవాలి. నీ జీవితములో వీటినుండి ఎప్పుడు గురి తప్పుతావో అప్పుడు దేవుని ఉద్దేశము నెరవేర్చలేవు.

నేను ఎన్నో దేశాలలో సువార్త ప్రకటిస్తున్నాను కదా అనే మనస్సుతో ఉన్నట్లయితే దేవుని కొరకు ఏది చేయాలో అది సంపూర్ణముగా చేయలేను. పౌలు ప్రపంచ సువార్తీకరణ జరిగిందని ఎన్నడు అనుకోలేదు నేను పాపులలో

ప్రధానుడను అపొస్తలుడను అనిపించుకోవడానికి యోగ్యుడను కాను అని అనుకున్నాడు. అది అందరియెదుట ఒప్పుకున్నాడు. అందువలన అపవాది పౌలును ఏమీ చేయలేకపోయింది. పాపం అతని మీద ప్రభుత్వం చేయలేదు పౌలు సమస్తమును జయించాడు.

వారు బోర్ల పడిపోయిన దాగోను దేవతను మరల నిలబెట్టారు. అందులో శక్తిలేదు అని వారికి తెలుసు. కాని వారు నిలబెడితే మరల అది నిలబడుతుందేమో అని అనుకొని దానిని నిలబెట్టారు. ఆ మరునాడు వారు ఉదయముననే లేవగా ఇదిగో దాగోను యెహోవా మందసం ఎదుట నేలను బోర్లపడి యుండెను. దాగోను యొక్క తలయు రెండు అరచేతులను తెగవేయబడి గడపదగ్గర పడియుండెను, వాని మొండెము మాత్రము మిగిలి యుండెను. వారు మరుసటి రోజు నిలబెట్టి ఆగిపోలేదు మరలా వచ్చారు అప్పుడు దాగోను యొక్క తలయు రెండు అరచేతులును గడప దగ్గర తెగి అవతల పడియున్నవి. ఎంత అద్భుతమైన కార్యము! ఇది దేవుడు తప్ప ఏ మనుష్యుడు చేయలేదని మనకు అర్థమవుతుంది. వారికి కూడా అర్థమయింది. అయితే వారు బోర్ల పడిపోయినదని వదిలివేయక మరుసటి ఉదయం వచ్చారు. ప్రియమైన దేవుని బిడ్డలారా ఒకరోజు ప్రయత్నము చేసి అపవాది నిన్ను విడిచిపెడతాడని అనుకోవద్దు. నీవు ఏదైన విషయములో జయము పొందావని ఇక నీ జోలి అపవాది రాదు అని అనుకొనవద్దు. ఈ పదేండ్లు దేవుడు నిన్ను కాపాడాడని అపవాది నీ యొద్దకు రాడు అని నీవు అనుకోకూడదు వాడు మరల మరల ప్రయత్నము చేస్తాడు. ఎలాగైనా దేవుని ఉద్దేశం పాడుచేయాలనేదే వాడి ఉద్దేశం. నీవు జాగ్రత్త పడి నీ జీవితములో దేవుని కొరకు ప్రయాణం చేయగలిగితే వాడి తల చితుక కొట్టిన ప్రభువు నీకు గొప్ప జయాన్ని ఇస్తారు. వ్యర్థమైన వాటి నుంచి పక్కకు వచ్చి దేవుడు నీకు ఇచ్చిన పిలుపు మీద మాత్రమే మనస్సు పెట్టుము. మిగిలినవన్ని దేవుడు నీ జీవితములో ఆలోచన చేసి జరిగిస్తారు.

చూస్తుండగానే ఈ సంవత్సరములో ఆరు మాసములు అయిపోయినవి. దేవుని సన్నిధిలో నీవు కనిపెట్టుకొని ప్రార్థన చేస్తే గొప్ప పని చేస్తావని అపవాదికి తెలుసు. అందుకని దేవుని సన్నిధిలో కూర్చొనకుండా నిన్ను ఆటంకపరుస్తాడు. గనుక అపవాది యొక్క పన్నాగాలను మీరు బ్రద్ధలు చేయాలి.

వారు ఆరోజే ఆగిపోలేదు ఇంకొక రోజు ఆగిపోలేదు వారెప్పుడు ఉదయకాలం ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. నీలో దేవుని కొరకు పని చేయగలిగిన శక్తి ఎక్కడుందో దాన్ని వాడు దెబ్బతీయాలనుకుంటాడు. నీవు పరిశుద్ధంగా ఉంటే అదే దేవుని శక్తి, నీవు పరిశీలన చేసుకుంటే అదే దేవుని శక్తి, మోకరిస్తే అదే దేవుని శక్తి ,నీ హృదయం తెరిస్తే అదే దేవుని శక్తి, ఆ శక్తి నీలో లేకుండా చేయాలని అపవాది చూస్తాడు. అందుకే నీ హృదయం తెరువకుండ మూసివేస్తాడు. నీవు దేవుని దగ్గరికి వెళ్ళవు దేవుని బిడ్డల దగ్గరికి వెళ్ళవు అదే అపవాది యొక్క పన్నాగం మనస్సులోనే పెట్టుకుని ఆలోచన చేసుకుంటూ ఉంటావు. దేవుని శక్తి ఏదో ఎక్కడి నుంచి దేవుని శక్తి దొరుకుతుందో వాడు మనసుపెట్టాడు. ఈ సహవాస దర్శనము ఏమనగా కడవరకు దేవుని చిత్తము చేయుట, ప్రపంచములోని ప్రతి ఆత్మ దేవుని చెంతకు చేరాలని, ఆ దర్శనములో మీరును పాలిభాగస్థులై పనిచేయుటకు, మీ వ్యక్తిగత జీవితములో దేవుని సన్నిధానమునకు దూరయుచేసి శక్తి హీనులుగా చేసి, దేవుని చిత్తము నీలో నెరవేర్చబడకుండా చేసెడి ప్రతి దానిని పరిశీలన చేసికొని అపవాది ప్రణాళికలను గుర్తెరిగి జాగరూకులై ఉండవలెనని కోరుతున్నాను. దేవుని హృదయములో ఉన్న ఆశలను నెరవేర్చులాగున దేవుడు మిమ్మును దీవించును గాక!

**-ఎడిటర్**

# విజ్ఞాపనలో విశ్వాసపు పాత్ర

ఈనాటి సంఘాలలో బాగా విరాళాలు ఇచ్చుటను బట్టి ప్రతిభనుబట్టి, వారి తలాంతులను బట్టి అనేకులు గొప్పవారుగా ఎంచబడి గౌరవించబడుచున్నారు. కాని గొప్ప విశ్వాసం కలిగి, పట్టువిడువని ప్రార్థన ద్వారా గొప్ప కార్యములు చూచిన వారిలో అతి కొద్దిమంది మాత్రమే గౌరవించబడుచున్నారు. నేటి సంఘానికి ఎన్నడూ లేనంతగా గొప్ప ప్రార్థనాపరులైన విశ్వాసవీరుల అవసరత ఉన్నది. అనుమానం, భయం ఈ రెండూ విశ్వాసానికి బద్ధశత్రువులు. కొన్నిసార్లు ఇవి విశ్వాస స్థానాన్ని ఆక్రమిస్తాయి గనుక మనం అశాంతితో అసౌకర్యంతో సణుగుడు గొణుగులతో కూడిన ప్రార్థన చేస్తాము. గెన్నేసరెతు తీరంలో నీటిమీద పేతురు నడువలేకపోవుటకు కారణం తన విశ్వాసపు శక్తిని అణిచివేసేలా అతడు సముద్రపు అలలను అనుమతించాడు. ఎప్పుడైతే దేవుని మీద నుండి తన దృష్టిని మరల్చి నీటి అలలవైపు దృష్టి సారించాడో అప్పుడే అతడు మునిగిపోవడం ప్రారంభించి "ప్రభువా నన్ను రక్షించుము" అని కేకలు వేశాడు.

హెబ్రి పత్రికలో ఇచ్చిన హెచ్చరికను గురించి మనమెంతో జాగ్రత్త వహించాలి. **"సహోదరులారా, జీవము గల దేవుని విడిచిపోవునట్టి విశ్వాసములేని దుష్టహృదయము మీలో ఎవని యందైనను ఒక వేళ ఉండునేమో అని జాగ్రత్తగా చూచుకొనుడి"** (హెబ్రి 3:12).

శత్రువు నుండి మనల్ని మనం ఎంతగా కాపాడుకొంటామో అవిశ్వాసం నుండి కూడా మనల్ని మనం అంతగా కాపాడుకోవాలి. **"ప్రభువా మా విశ్వాసాన్ని వృద్ధిపొందించుము"** లూకా 17:5 అని మనమెల్లప్పుడూ ప్రార్థించాలి. ఎందుకనగా విశ్వాసానికి వృద్ధిచెందే గుణం ఉంది. థెస్సలొనీకయులు విశ్వాసంలో వృద్ధిచెందారని పౌలు వారిని అభినందించాడు (2థెస్స. 1:3). విశ్వాసమును అభ్యాసం చేసికొంటూ దానికి పదును పెడుతూ

ఉండాలి అప్పుడే విశ్వాసం వృద్ధి చెందుతుంది. కఠినమైన పరీక్షల ద్వారా మాత్రమే అది పోషించబడుతూ ఉంటుంది. దేవుని వాక్యము చదివి ధ్యానించడం ద్వారా విశ్వాసం వృద్ధి చెందుతుంది. అన్నింటికంటే ఎక్కువగా ప్రార్థనా వాతావరణంలో విశ్వాసం జీవం పోసుకొని ఎదుగుతుంది.

దేవునియందు నాకు విశ్వాసం ఉందా? ఇహసంబంధమైన మరియు పరసంబంధమైన విషయాలలో పరిపూర్ణమైన సమాధానంతో నింపబడే నిజమైన విశ్వాసం నాకుందా? "దేవుని నుండి నేరుగా నేనడిగిన వాటిని పొందగల్గుతున్నానా?" అని మనల్ని మనం ప్రశ్నించుకోవాలి.

అగస్టస్ సీజర్ చెట్లతోను, పుట్టలతోను నిండిన రోమా నగరాన్ని పాలరాతి నగరంగా మార్చాడని చెబుతారు. ప్రార్థనాలేమితో కొట్టుమిట్టాడుతున్న తన సంఘస్థులను ప్రార్థనాపరులుగా మార్చగలిగిన ఒక సంఘకాపరి అగస్టస్ సీజర్ కన్నా గొప్ప పనిచేసినవాడవుతాడు. నిజానికి బోధకుని యొక్క ప్రాథమికమైన పని ఇదే. బోధకుడు కేవలం సంఘములో ఆత్మలను చేర్చడానికో లేక ప్రజలను భౌతికంగా కాస్త మెరుగైన స్థితిలోనికి తీసికొనివచ్చుటకో పంపబడలేదు కాని వారు ప్రార్థించులాగున, దేవునియందు నమ్మికయుంచే విధంగా వారి కన్నుల ఎదుట ఎల్లప్పుడూ దేవునిని ఉంచుకొని ఆయనకు విరోధంగా పాపం చేయకుండా చేసేందుకు పంపబడ్డాడు.

విశ్వాసము ద్వారా మనము రక్షించబడ్డాము. విశాస్వం ద్వారానే రక్షణలో కొనసాగుచున్నాము. ప్రార్థన మనలో విశ్వాస జీవితాన్ని ప్రారంభిస్తుంది. తన్ను ప్రేమించి తన కోసం ప్రాణం పెట్టిన దేవుని కుమారునియందలి విశ్వాసం ద్వారా తాను జీవిస్తున్నట్లుగా అపొస్తలుడైన పౌలు చెప్పాడు. **"నేనిప్పుడు శరీరమందు జీవించుచున్న జీవితము నన్ను ప్రేమించి, నా కొరకు తన్ను తాను అర్పించుకొనిన దేవుని కుమారుని యందలి విశ్వాసమువలన జీవించుచున్నాను"** (గలతి. 2:20). కంటికి కనిపించే వాటిద్వారా కాక, విశ్వాసముద్వారా తాను నడిపించబడుచున్నట్లు అతడు చెప్పాడు.

విశ్వాసం ప్రార్థనను శక్తివంతమైనదిగా చేస్తుంది. విశ్వాసం ప్రార్థనకు ముందు నడవాలి. ఎందుకనగా **"దేవునియొద్దకు వచ్చువాడు ఆయన యున్నాడనియు తన్ను వెదకువారికి ఫలము దయచేయువాడనియు నమ్మవలెను గదా!"** హెబ్రి. 11:6.

దేవునివైపు తిరిగి ప్రార్థన ప్రారంభించడానికి ముందే, ప్రార్థనా మనవులు సిద్ధంచేయబడకముందే విశ్వాసం ఠీవిగా నడుచుకొంటూ ముందుకు వెళ్ళాలి. ఆయన యున్నాడని నమ్ముతూ, తన్ను వెదకువారందరికి తప్పక ఫలము దయచేస్తాడనే సత్యానికి సమ్మతిస్తూ ముందుకెళ్ళాలి. ప్రార్థించడం లోని ప్రాథమికమైన మెట్టు ఇదే. విశ్వాసము ఆశీర్వాదాన్ని తీసుకొనిరాలేదు గాని ఆశీర్వదించేందుకు దేవుడు సమర్థుడనీ, సిద్ధమనస్సు గలవాడనీ నమ్మడానికి ప్రార్థించే వ్యక్తికి సహకరించి ఆశీర్వాదాన్ని వాస్తవిక రూపంలో మన ముందుంచుతుంది.

విశ్వాసం ప్రార్థనను కార్యరూపం దాల్చేలా చేసి కృపాసనం వద్దకు మార్గాన్ని సరాళం చేస్తుంది. అన్నింటికన్నా ముందు కృపాసనం అనేది ఒకటుందనీ, ప్రార్థనా విన్నపాలతో ఆ కృపాసనాన్ని చేరే శరణార్థుల కోసం ప్రధాన యాజకుడైన యేసు ఎదురుచూస్తున్నాడని మనకు నిశ్చయతను కలుగజేస్తుంది. 'ప్రార్థన' దేవుని యొద్దకు చేరుటకు 'విశ్వాసం' ద్వారము తెరచి ఆ మార్గంలో అడుగడుగునా ప్రార్థనకు తోడుగా ఉంటుంది. విశ్వాసం అనేది ప్రార్థనకు విడదీయలేని సహకారిగా ఉంటుంది. దేవునికి విన్నపములు చేయబడుచున్నప్పుడు విశ్వాసం అడగడాన్ని పొందడంగా మార్చుతుంది. విశ్వాసం ప్రార్థనను వెంబడిస్తుంది. ప్రార్థన ద్వారా విశ్వాసులు నడిపించబడే జీవితం క్రియలతో కూడిన జీవితం కాదు. అది పూర్తిగా విశ్వాస సంబంధమైనదే.

అనుమానం విశ్వాసానికి శత్రువు గనుక దానిని విసర్జించాలి. భయము, బహుశా జరుగుతుందో లేదో అన్న భావనలకు నిజమైన ప్రార్థనతో

చోటుండదు. ఈ శత్రువులను తననుండి తొలగిపొమ్మని విశ్వాసం గట్టిగా ఆజ్ఞాపిస్తుంది.

'ఈ లోకంలో మనం యాత్రికులం' అనే మనస్సు ప్రార్థించడాన్ని సులభతరం చేస్తుంది. భూలోకాన్ని హత్తుకొని, భూసంబంధమైన వాటితో తృప్తిచెందే ఆత్మ ప్రార్థించలేదు. అలాంటి ఆత్మీయ అగ్నిజ్వాల ఆరిపోయైనా ఉండాలి లేదా మంట లేకుండా వెలుగుతూనైనా ఉండాలి. ఆత్మయొక్క విశ్వాసపు రెక్కలు కత్తిరించబడి, విశ్వాస నేత్రాలు పొరలు కమ్మి దాని నాలుక పలుకక మౌనంగా ఉంటుంది. ఎవరైతే చలించని విశ్వాసంతో ఎడతెగక ప్రార్థిస్తూ నిరంతరం ప్రభువు కోసం ఎదురుచూస్తూ ఉంటారో వారు నూతన బలం పొందుతారు, పక్షిరాజువలె రెక్కలు చాపి పైకెగురుతారు, అలయక పరుగెత్తుతారు, సొమ్మసిల్లక నడచిపోతారు.

ప్రార్థన ఎన్నడూ ఒంటరిగా నిలువక విశ్వాసంతో పెనవేయబడి ఉంటుంది. విశ్వాసం ప్రార్థనకు రంగునూ, రూపాన్ని ఇస్తుంది. ప్రార్థన యొక్క స్వభావాన్ని రూపుదిద్ది ఫలితాలను సాధిస్తుంది.

## శపితమైన దానిమీద దృష్టి

మన ఆత్మీయ జీవితములో ఎప్పుడైతే మన దృష్టి శాపగ్రస్తమైన వాటి మీదకు వెళ్తుందో ఆత్మీయముగా పతనావస్థలోనికి దిగిపోతాము. ఆత్మసంబంధమైన వాటిమీదికి నీ దృష్టి వెళ్తే దేవుడు నిన్ను ఉన్నతంగా ఆశీర్వదిస్తాడు.

ఆకాను అనే వ్యక్తి ఇశ్రాయేలీయులలో యూదా గోత్రములో జన్మించాడు. ఈ ఆకాను ఇశ్రాయేలీయులకు నాయకుడైన యెహోషువ దగ్గర ఒక మంచి సైనికుడిగా ఉన్నాడు. దేవుని బిడ్డలతో ఎంతో ఆత్మీయముగా కొనసాగుతున్న ఆకాను జీవితం ఒక మలుపు తిరిగింది. అది శాపగ్రస్తమైన జీవితానికి దారి తీసింది. అందుకు కారణము ఏమిటంటే ఆకాను దృష్టి శాపగ్రస్తమైన వాటిమీదికి వెళ్ళింది.

దేవుడు యెరికోను దానిలో ఉన్న వాటిని శపించాడు. శపించిన దానిలో మీరు కొంచెమైనను తీసికొనినయెడల శాపగ్రస్తులై ఇశ్రాయేలీయుల పాళెమునకు శాపము తెప్పించి దానికి బాధ కలుగజేయుదురు గనుక శపించబడిన దానిని ముట్టకూడదు అని దేవుడు చెప్పినా ఆకాను యెరికోలో ఉన్న శాపగ్రస్తమైన బంగారం, వెండి, షీనారు వస్త్రము కోరుకొన్నాడు. యెహోషువ 6:10.

ఆకాను దృష్టి దేవుడు శపించిన వాటిమీదికి వెళ్లడంవలన తన కుటుంబమంతా శపించబడెను. ఆకాను కుటుంబములో ఒకరు కూడా మిగులలేదు. దేవుడు వద్దు అన్నది మనము కోరుకొన్నా, ఆశించినా అది మనకు శాపమే కాని ఆశీర్వాదము కాదు. అది ఎంత విలువైనది అయినా అది శాపగ్రస్తమే.

ఒక పెద్దాయన బట్టలు కుట్టేవాడు. తాను కుట్టగా మిగిలిన ముక్కలు అన్ని దాచుకొని తన ఇంటిలో వాళ్ళకి కావలసినవి కుట్టేవాడు. దేవుడు అతనితో నీ ఇంటిలో శాపగ్రస్తమైనవి ఉన్నవి అని మాట్లాడితే ఆ పెద్దాయన పశ్చాత్తాపపడెను. నీది కానిది నీవు ఆశించినా అది శాపగ్రస్తమైనదే. ధర్మశాస్త్రము నందు వ్రాయబడిన విధులన్నియు చేయుట యందు నిలకడగా ఉండని ప్రతివాడును శాపగ్రస్తుడు (గలతి. 3:10). దేవుడు నీకిచ్చిన విధులమీద నీ దృష్టి ఉంచకుండా వేరే దానిమీద దృష్టి ఉంచితే అది నీకు నష్టమే. ఆకాను తన జీవితములో యెహోషువాతో కలిసి ఎన్నో యుద్ధాలు చేసి నాయకుని యొక్క జయంలో పాలివాడయ్యెను.. ఎప్పుడైతే అతని దృష్టి శాపగ్రస్తమైన వాటిమీదకు వెళ్ళిందో తన కుటుంబానికే కాదు నాయకునికే కాదు దేవుని నామమునకు కూడ ఎంతో అవమానము కలుగును. ఇది చూచిన శత్రువుకు ఎంత బలం. నీ దృష్టి ఆత్మసంబంధమైన వాటిమీద ఉంటే శత్రువు బలహీనుడైపోతాడు.

ఎంతో సాఫీగా సాగిపోతున్న ఆకాను కుటుంబం శపితమైన దానిమీద దృష్టి పెట్టినప్పుడు ఎంత నష్టపోయారు. ఆకాను వంశావళి భూమిమీద లేదు.

కావునా శపితమైన వాటిమీదకు మనదృష్టి వెళ్ళకూడదు. అబ్రాహాము నూలుపోగు కూడా సొదొమ రాజు యొద్దనుండి తీసికొనుటకు ఇష్టపడలేదు. నీతితో కూడినది కొంచెమైనా అది శ్రేష్ఠమైనది. గనుక మన దృష్టి నీతిమార్గమునుండి కుడిఎడమలకు తొలగకుండా జాగ్రత్తపడవలెను.

# ఒక మాదిరి కుటుంబము

అబ్రాహాము యొక్క గృహము విశ్వాసులకు ఒక మాదిరి గృహము, ఆ గృహములో ప్రతి వ్యక్తియు విశ్వాసియే! విశ్వాసమును బట్టి అబ్రాహాము దేవుని దృష్టిలో నీతిమంతుడు. అతని భార్యయైన శారా విశ్వాసము వలన కుమారుని సంపాదించుకొని విశ్వాసులకు తల్లి అని దేవునిచే పిలువబడెను (హెబ్రీ. 11:11,12). వీరి కుమారుడు ఇస్సాకు దైవ ధ్యానమున జీవితమును గడిపి ఒక మంచి మాదిరి జీవితమును చూపెను (ఆది. 24:63). వీరి కోడలు రిబ్కా దైవ చిత్తమునకు విధేయురాలై బంధుజనమును విడిచి అబ్రాహాము ఇంటికి బయలు వెడలెను. వీరి సేవకుడైన ఎలియాజరు కూడా గొప్ప విశ్వాసి, ప్రార్థనాపరుడు దైవాత్మ నడుపుదల గలవాడై రిబ్కాను గుర్తించెను. అబ్రాహాము యింటనున్న జంతువులు కూడా దైవ మహిమార్థమైన అభ్యాసములనే కలిగి ఉండెను. ఎలియాజరు మోకరించి ప్రార్థించుచుండగా ఒంటెలు అతనితో మోకరించెను (ఆది. 24:11-15). ఎంత ఆశ్చర్యము! అంతేకాదు అబ్రాహాము ఇంటనున్న ప్రతి వస్తువు దేవుని మహిమపరచునదియే. అబ్రాహాము అన్యరాజులను జయించి తెచ్చిన ఆస్తి తీసికొనమని సొదొమ గొమొఱ్ఱా రాజు అడుగగా అబ్రాహాము ఇచ్చిన జవాబు చూడండి ఆకాశమునకు భూమికి కర్తయును సర్వోన్నతుడను దేవుడునైన యెహోవా యెదుట నా చెయ్యెత్తి నేనే అబ్రాహామును ధనవంతునిగా చేసితినని నీవు చెప్పకుండునట్లు ఒక్క నూలుపోగైనను చెప్పుల వారైనను నీ వాటిలో ఏదైనను తీసికొనననని ప్రమాణము చేసియున్నాను ఆది. 14:21-23. ఆహా! అబ్రాహాము కుటుంబ జీవితమెంత శ్లాఘనీయము! చదువరీ, నీ కుటంబ జీవితము ఒక్కసారి పరీక్షించుకొనుము? ప్రభువు నీ గృహములో నివసించుచున్నాడా? నీ గృహమున నున్న ప్రతి వ్యక్తి జీవితము ప్రతి వస్తువు దేవుని మహిమార్థమైనవా? నీ గృహమును అలంకరించిన ప్రతి వస్తువు ఆయన మహిమార్థమైనదేనా?

# శోధనను జయించుట

**"ఆ శోధకుడు ఆయన యొద్దకు వచ్చి నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను. అందుకు ఆయన- మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను"** మత్తయి 4:3,4.

లోకరక్షకుడైన యేసుక్రీస్తు వారిని అపవాది శోధించెను. అయితే ఆయన దేవుని వాక్యమునకు లోబడి దేవుని చిత్తమును ఈ లోకములో సంపూర్తి చేశారు. అపవాది ఆయనయొద్దకు వచ్చి ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమని శోధిస్తున్నాడు. అందుకు ఆయన మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోట నుండి వచ్చు ప్రతి మాటవలనను జీవించును అని వాక్యముతో అపవాదిని ఎదిరించెను. అప్పటికి యేసు నలుబది దినములు నలుబది రాత్రులు ఉపవాసము ఉండెను. ఆకలితో ఉన్న యేసుకు ఇది ఒక శోధన. దేవుని ఆజ్ఞలను గైకొనుటమే దేవుని చిత్తం. అదే మనకు ఆహారమును పానియమునై యుండవలెను.

అపవాది పరిశుద్ధ పట్టణమునకు తీసికొని పోయి దేవాలయ శిఖరమున ఆయనను నిలువబెట్టి నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము ఆయన నిన్ను గూర్చి తన దూతలకు ఆజ్ఞాపించును నీ పాదము రాతికి తగులకుండ వారు నిన్ను చేతులతో ఎత్తుకొందురని వ్రాయబడి యున్నదని ఆయనతో చెప్పెను. అందుకు యేసు- ప్రభువైన నీ దేవుని నీవు శోధింపవలదని మరియొకచోట వ్రాయబడియున్నదని వానితో చెప్పెను. అపవాది ఆశోధనను విడిచిపెట్టి మరొక శోధనను తీసుకొని వచ్చెను. మిగుల ఎత్తైన యొక కొండమీదకు తనను తోడుకొని పోయి ఈ లోక రాజ్యములన్నిటిని వాటి మహిమను ఆయనకు చూపి నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటన్నిటిని నీకిచ్చెదనని ఆయనతో చెప్పగా

యేసు వానితో సాతానా పొమ్ము- ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింపవలెను అని వ్రాయబడి యున్నదనెను. ప్రభువు వాక్యమనే ఖడ్గముతో అపవాది శోధనలను జయించెను. శరీరాశ నేత్రాశ జీవపుడంబము అపవాది మనముందుకు తీసికొని వచ్చి మనలను శోధిస్తాడు. దేవుని వాక్య ఖడ్గముతో అపవాదిని ఎదిరించాలి.

ప్రభువు మనకు ఒక మంచి మాదిరిని అన్ని పరిస్థితులలో చూపించారు. దేవుని వాక్యాన్ని ఏ విధంగా ఉపయోగించాలో యేసయ్య నేర్పించారు. ఆయన శరీరధారిగా ఈ లోకములో ఉన్నప్పుడు మనవలే శోధింపబడినను ఆయన పాపము లేని వానిగా జీవించెను. ప్రభువు సాతానును గద్దించినప్పుడు సాతాను ప్రభువును విడిచిపెట్టి వెళ్ళిపోయెను. యేసుప్రభువు గెత్సెమనే తోటలోఉన్నప్పుడు దేవుని చిత్తం చేయకుండా ఉండాలని అపవాది శోధించెను, సిలువ మీద శోధించెను, సిలువ మరణం నీకు దూరమవును గాక అని పేతురు ద్వారా కూడ శోధించెను. సిలువ మీద వ్రేలాడుచున్న దొంగ కూడా నీవు క్రీస్తువు కదా? నిన్ను నీవు రక్షించుకొనుము మమ్మును కూడా రక్షించుము అని పలికెను. ఆయన తనని తాను రక్షించుకోవడానికి ఈ లోకానికి రాలేదు నశించిపోతున్న ఈ సర్వ మానవాళిని రక్షించుటకు మరియు ప్రాణము పెట్టుటకు ఈ లోకానికి వచ్చెను. అది ఈ దొంగలకు తెలియదు. దొంగ ద్వారా అపవాది ప్రభువును శోధించెను. అయినను సిలువలో సహితము ఏ శోధనకు ఆయన తావీయక సమస్తమును జయించెను. మనము కూడా శోధనలు ఎదుర్కొనునప్పుడు ప్రభువువలె దేవుని వాక్యముతో అపవాదిని ఎదిరించవలెను. కాబట్టి సర్వాంగ కవచంలో ఉన్నటువంటి దేవుని ఆత్మ ఖడ్గమును మనము చేతితో పట్టుకుని అపవాదిని ఎదిరించాలి. మన హృదయములో ఉన్న వ్యర్థత్వమును తొలగించుకొని దేవుని వాక్యముతో మనలను నింపుకొనినప్పుడు మాత్రమే అపవాదిని మనము ఎదిరించగలము.

**“ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు? అని మంచి ధైర్యముతో చెప్పగలవారమై యున్నాము”** హెబ్రి. 13:6. దావీదుకు దేవుడే సహాయకుడు. తన నోట ఉంచబడిన దేవుని వాక్యము అనే ఖడ్గముతో దావీదు శత్రువైన గొల్యాతుని జయించాడు. గోల్యాతుతో యెహోవా పేరట నేను వస్తున్నాను అని యుద్ధము యెహోవాదే అని ప్రకటించాడు. గొల్యాతు చేతిలో ఉన్న ఖడ్గం కంటే దావీదు నోట ఉన్న వాక్యము బలమైనది, శక్తి గలిగినది. దావీదు బాలుడే చిన్నవాడే అనుభవం లేనివాడే కానీ అంత పెద్ద శూరుడైన గొల్యాతును ఎలా జయించగలిగెను? దేవుని వాక్యము దావీదు నోట, హృదయంలో, చేతిలో ఉండెను. అందుకే గొల్యాతును జయించెను. ఈరోజు నీ ముందు ఎంత పెద్ద గోల్యాతు ఉన్నా దేవుని వాక్యంతో జయించుటకు ప్రభువు శక్తిని ఇస్తాడు. ఏ పాపమైనా, శాపమైనా, ఇరుకైన జయించుటకు ఒక్కటే ఆధారం దేవుని వాక్య ఖడ్గం. ప్రపంచంలో శక్తి కలిగినది ఏదైనా ఉంది అంటే అది దేవుని వాక్యమే. బలము గలిగినది ఏదైనా ఉంది అంటే అది దేవుని వాక్యమే. రక్షించేది ఏదైనా ఉంది అంటే అది క్రీస్తు ప్రభువు నామము మాత్రమే. కాబట్టి మనము దేవుని యొక్క వాక్యమునకు లోబడే వారుగా ఉండవలెను.

**“నీ యెదుట నేను పాపము చేయకుండునట్లు నా హృదయములో నీ వాక్యము ఉంచుకొనియున్నాను”** కీర్తన 119:11. **“క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనియ్యుడి”** కొలొస్స. 3:16. దేవుని వాక్యమును హృదయంలో పెట్టుకోవాలి. దేవుని వాక్యము మన హృదయాలలో సమృద్ధిగా నివసింపనియ్యాలి. దేవుని వాక్యము నీ హృదయంలో సమృద్ధిగా ఉన్నదా. ఎంత వాక్యమును నువ్వు చదువుతున్నావు ఎంత వాక్యమును ధ్యానిస్తా ఉన్నావు, ఎంత వాక్యమును నీ హృదయంలో దాచుకుంటా ఉన్నావు. ఎంతగా నీవు దేవుని వాక్యమునకు లోబడుతున్నావు. ఈ దినాలలో వాక్యం చదవగలిగినంతగా మనం చదువుతున్నామా లేకుంటే వ్యర్థమైన వాటితో మన

హృదయాలను నింపుకుంటున్నామా. మన హృదయములోనుండి చెత్తాచెదారాన్ని తొలగించుకొనవలెను. మనము దేవుని శక్తిని పొందుకొని వాక్యమనే ఖడ్గముతో అపవాదిని జయించాలి.

దేవుని వాక్యము అది ఎంతో యథార్థమైనది అది ప్రాణాన్ని తెప్పరిల్ల చేస్తుంది. మన హృదయాన్ని సంతోషపరుస్తుంది. వెండి బంగారముల కంటే అది కోరదగినది. జుంటి తేనె ధారల కంటే మధురమైనది కాబట్టి ఆత్మ ఖడ్గాన్ని ధరించుకొని అపవాదిని ఎదిరించడానికి మనము బలవంతులమై శక్తివంతులుమై సాతాను యొక్క దుర్గములను కూల ద్రోయుటకు పరిశుద్ధాత్మ దేవుడు మనకు సహాయం చేయాలని ప్రభువు సన్నిధిలో మనం మొరపెట్టుకోవాలి.

**"నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని తన యజమానుని భార్యతో అనెను"** ఆది. 39:9. ఇంత ఘోరమైన దుష్కార్యమును నేను ఎలా చేస్తాను, నా దేవునికి వ్యతిరేకంగా నేను పాపం ఎలా చేస్తాను అని పోతిఫరు భార్యతో యోసేపు చెప్తున్నాడు. దేవుని వాక్యము దైవ భయమును కలుగజేస్తుంది. దేవుని వాక్యము నిర్మలమైనది యోసేపు దేవునికి భయపడి నిర్మలమైన దేవుని వాక్యమును పట్టుకున్నాడు. శ్రమ కాలమైన యోసేపు సహించాడు కానీ అపవాదికి చోటు ఇవ్వలేదు. మన పూర్వీకులు పెద్దలు పరిశుద్ధులు ఎలాగు దేవుని వాక్యమునకు లోబడి దేవుని చిత్తమును చేశారు. మన జీవితంలో మనం కూడా దేవుని వాక్యమునకు లోబడి దేవుని ఆత్మ ఖడ్గాన్ని ధరించుకొని సాతానును ఛేదించాలని దేవుడు కోరుకుంటున్నారు. సర్వాంగ కవచం లో ఉన్నటువంటి ఆరు భాగాలలో ఏ భాగము లేకపోయినా అపవాది మనపై దాడి చేస్తాడు దానిని మనం సంపూర్ణంగా జయించలేము ఎదిరించలేము. సర్వాంగ కవచంలో ఉన్నటువంటి ఆరు భాగాలను మనం కలిగి ఉన్నప్పుడు మాత్రమే అపవాదిని ఎదిరించుటకు ప్రభువు మనకి శక్తిని ఇస్తారు బలాన్ని

ఇస్తారు. సత్యమను దట్టి కట్టుకొని ఉన్నామా నీతియను మైమరవు తొడుగుకొని ఉన్నామా పాదములకు సమాధాన సువార్తవలననైనా సిద్ధ మనస్సను జోడు తోడుగుకొని ఉన్నామా విశ్వాసమను డాలు పట్టుకొని ఉన్నామా రక్షణ అనే శిరస్త్రాణమును కలిగి ఉన్నామా దేవుని వాక్యము అనే ఆత్మ ఖడ్గమును కలిగి ఉన్నామా మన హృదయంలో మన చేత మన నోట దేవుని వాక్యము అను ఖడ్గమును కలిగి ఉన్నప్పుడు మాత్రమే అపవాదిని ఎదిరించడానికి ప్రభువు కృప సమృద్ధిగా ఇస్తారు. ఎక్కడైనా సత్యములో నుండి దేవుని నీతిలో నుండి తప్పిపోతున్నామా తిరిగి మరల నా దగ్గరికి రమ్మని ప్రభువు పిలుస్తున్నారు. అవిధేయులైన వారి కొరకై దినమంతయు నా చేతులు చాపబడియున్నవి అని ప్రభువు పిలుస్తున్నారు. కాబట్టి దేవుని వాక్యానికి మనం లోబడ్డామా తీర్పు నుండి తప్పించబడతాము. ఈ దినాలలో దేవుని నోట నుండి వచ్చే మాటే మనల్ని రక్షిస్తుంది. దేవుని మాటకు మనం అవిధేయత చూపిస్తే పరలోకంలో నుండి దేవుని కోపం మన మీదకి వస్తుంది. అప్పుడు మనం ఎక్కడ నిలబడతాము. దేవుని కోపాన్ని ఎక్కడ తాళుకుంటాము, తట్టుకుంటాము.

సమయం ఉండగానే ప్రభువు పాదాలను ఆశ్రయించి మన దోషాలను ఒప్పుకున్నట్లయితే ప్రభువు మనకు విడుదల కలుగ చేస్తారు. ఎక్కడ దేవునికి దుఃఖాన్ని కలుగజేస్తున్నాము, దేవుని వాక్యానికి లోబడకుండా వాక్యాన్ని ధ్యానించకుండా దేవునికి సమయాన్ని ఇవ్వకుండా లోకంతో వ్యర్థతంతో గడుపుతూ దేవుని దుఃఖపెట్టేవారిగా ఉండకుండా, పరిపూర్ణంగా దేవుని వాక్యమునకు లోబడుటకు క్రీస్తు వాక్యము సమృద్ధిగా మన హృదయములలో నింపుకొని సాతానును ఎదిరించుటకు పరిశుద్ధాత్ముడు మనకు సహాయం చేయను గాక.

# నేటికి మూడు దినములనుండి

జాన్‌మార్కు మరియు దయమ్మ దంపతులు ప్రభువు పిలుపునందుకొని సమస్తమును విడిచిపెట్టి సేవకై సమర్పించుకున్నారు. వారికి అయిదేళ్ళ కుమారుడు కూడ ఉన్నాడు. వారికిప్పుడు జీతభత్యములు లేవు. ఎవరినీ అప్పు అడుగకూడదు. ప్రతి అవసరత నిమిత్తము ప్రభువువైపే చూడాలి. సేవ ఆరంభ దశలోనున్నందున సంఘమునుండి కూడ అంత సహాయములేదు. ప్రభువే వారికి మంచి తర్ఫీదును ఇచ్చుచున్నాడు. వారు ఆర్థికపరమైన అనేక ఇబ్బందులను ఎదుర్కొంటూ ఉన్నారు.

ఒక దినమున వారింటిలో ఏమి లేవు. సరుకులన్ని అయిపోయాయి. పోని గంజినీళ్ళతోనైన సరిపెట్టుకుందామంటే బియ్యం కూడ లేవు. కొనడానికి డబ్బులు లేవు. "తాము పస్తుపడియున్న ఫరవాలేదు. కాని బిడ్డ సంగతేంటి?" అని ఆలోచించారు దయమ్మగారు. ఈ ఊరు వారికి క్రొత్త అయినప్పటికి ఒక మంచి స్నేహితుడున్నాడు. అతని నడిగితే అప్పు ఇస్తాడు. కిరాణాకొట్టు యజమానికి కూడ వీరి మీద మంచి అభిప్రాయమున్నందున ఎన్ని సరుకులైన అరువు ఇస్తాడు. కాబట్టి జాన్‌మార్కు గారు తన భార్యను చూచి "నా స్నేహితుని దగ్గరగాని కిరాణాకొట్టులోగాని అప్పు తెమ్మంటావా? లేక దేవుడిచ్చే వరకు వేచి యుంటావా? అని అడిగాడు.

దయమ్మగారు విశ్వాసంతో "అప్పు వద్దులెండి, దేవుడిచ్చే వరకు వేచియుందాం" అన్నారు. వారి చేతిలో 50 పైసలున్నవి. దానితో రెండు ఇడ్లీలు కొన్నారు. వాటిని అబ్బాయికి తినిపించి స్కూలుకి పంపించారు. లంచ్ కట్టనందున ఆ అబ్బాయి ఆకలితో అలమటించాడు. సాయంకాలం ఇంటికి వచ్చి ఆకలి అని ఏడ్వసాగాడు. వాళ్ళ యింట్లో కొంచెం చక్కెర ఉంది దానిని నీళ్లల్లో కలిపి అబ్బాయికి త్రాగించారు. కొంచెం ఉపశమనం కలిగినందున అబ్బాయి చక్కగా నిద్రపోయాడు.

ఎలాగో ఒకరోజు గడిచిపోయింది. రెండవరోజు రానేవచ్చింది. ఇంకను సహాయం రాలేదు. రెండవ రోజున కూడ అబ్బాయికి మూడు పుటలా పంచదార నీళ్ళు త్రాగించారు. ప్రభువుకు మొఱ్ఱపెడుతూ ఉన్నారు. అయినా ఎటువైపునుండి కూడ సహాయము రాలేదు. రెండవ దినము గడిచింది. మూడవ దినము కూడ వచ్చింది. పిల్లవాడు మరల ఆకలితో అలమటించాడు. మరల యథాప్రకారం పంచదార నీళ్లు త్రాగించారు. పిల్లవాడు వాంతి చేసుకొన్నాడు. ఆ తల్లిదండ్రుల హృదయాలు ద్రవించాయి. "ప్రభువా! ఏమిటి పరిస్థితి? మాకు సహాయం చేయవా? అని మరల ప్రార్థన చేశారు.

జాన్‌మార్కు గారు బైబిలును చదువుచుండగా దేవుడు తన వాక్యము ద్వారా మాట్లాడాడు. **"జనులు నేటికి మూడు దినములనుండి నా యొద్ద నున్నారు. వారికి తిననేమియు లేనందున నేను వారి మీద కనికరపడుచున్నాను"** మార్కు 8:2. ఈ వాక్యము స్పష్టముగా వాళ్లను గురించే వ్రాయబడినట్టు ఉన్నది. ఈ దినమున తప్పక ప్రభువు సహాయం పంపిస్తారని వారికి అర్థమయ్యింది. సహాయం కొరకు ఎదురుచూశారు.

సమయం ఒంటి గంటయ్యింది. మిట్ట మధ్యాహ్నాం. మండుటెండలో పోస్టు మ్యాన్ వచ్చి జాన్‌మార్కు గారిని పిలిచాడు. అయ్యా మీకు వంద రుపాయలు మనియార్డరు వచ్చింది అని చెప్పి ఆ డబ్బును ముట్టజెప్పాడు. ఆ దంపతులిద్దరు ఆశ్చర్యపడ్డారు. దేవుని ఎంతగానో స్తుతించారు.

వెంటనే అంగడికి వెళ్ళి సరుకులను కొనితెచ్చారు జాన్‌మార్కుగారు. దయమ్మగారు వడివడిగా వంటచేసి మొదట బిడ్డకుపెట్టి తరువాత వారు పుష్టిగా ఆరగించారు. ఈ పరీక్షలో నెగ్గిన తరువాత దేవుడు వారిని, వారి సేవను దీవించారు. వారి సేవద్వారా అనేకమంది రక్షించబడి, స్వస్థపరచబడి అనేకమైన మేళ్ళను పొందారు. మరల ఇటువంటి ఇబ్బందికరమైన పరిస్థితి వారికెన్నడు రాలేదు. దేవునికి మహిమ కలుగును గాక.

RNI Regd.No.AP TEL/1998/ 6358 Postal Regd.No.GTR/64/2025-27

## -: కృపలో ఎదుగువారు :-

- పాపముల కొరకు పశ్చాత్తాపపడి మారుమనస్సు పొందినవారే కృపలో ఎదుగగలరు.
- బైబిల్ జ్ఞానమునందు ఎదుగవచ్చును గాని దేవుని యందలి అనుభవ జ్ఞానంలో ఎదుగువారే కృపలో ఎదుగువారు.
- క్రీస్తువలన బోధింపబడువారే కృపలో ఎదుగగలరు మరియవలె క్రీస్తు పాదములయొద్ద కూర్చుండి ఆయన మాట వినువారే కృపలో ఎదుగగలరు. మత్తయి 11: 29
- దేవునికి సమర్పణ చేయువారే కృపలో ఎదుగుదురు.
- దేవునిని ఎడతెగక వెదుకువారే కృపలో ఎదుగుదురు.
- తాము నేర్చుకొను సత్యమంతటికి లోబడువారే కృపలో ఎదుగగలరు.
- మేళ్ళ కొరకే కాదు గాని కీడు సంభవించినను క్రీస్తునే వెంబడించెదనను భావముగలవారు కృపలో ఎదుగగలరు.
- స్వచిత్తము విడిచిపెట్టి దేవుని చిత్తమును చేయగోరువారే కృపలో ఎదుగుదురు.
- పాత స్వభావమును విడిచిపెట్టుచు క్రీస్తు స్వభావమును ధరించుటకు ఆశపడువారే కృపలో ఎదుగుదురు.
- అన్ని విషయములలో దేవుని చిత్తమును తెలిసికొని చేయుటకు ప్రయాసపడువారే కృపలో ఎదుగగలరు.

To,
Sri / Smt.

If undelivered please return to :
**Bro. DEEVANAIAH,** Editor,
*PARIPURNA VIDUDALA*
Horeb Prardhana Konda, **BUDAMPADU**
Etukuru - 522 017, Guntur Dist. A.P.
Phone : +91 7893823893

Edited, Published and owned by Bro. Chereddy Deevanaiah, Horeb Prardhana Konda, Budampadu - 522 017, Guntur Dist.
Printed by P. Srinivasa Rao, at Ushasri Graphics, Lalapet, Guntur, Ph : 2224257
Date of Posting : 4th & 5th of Every Month